నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 31 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మనోహర్‌కు నివాళి

మనోహర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, డిసెంబర్ 30 : కాసిపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు కమాన్ మనోహర్ అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మనోహర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

సత్వరమే స్పందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 30 : ప్రజావాణిలో అందిన దరఖాస్తులపై సత్వరమే స్పందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు అందించారు. ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థులు తమ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని దరఖాస్తు అందజేశారు.

రడగంబాల బస్తీలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజల భద్రత పోలీసుల బాధ్యత

● బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ● రడగంబాలబస్తీలో కార్డన్‌సెర్చ్

బెల్లంపల్లి, డిసెంబర్ 30 : ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రడగంబాల బస్తీలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ సోదాలు నిర్వహించారు. అనుమానితుల గురించి ఆరా తీశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 24 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. అనంతరం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. అనుమానితులెవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అప్జలుద్దీన్, టూటౌన్, తాళ్ల గురిజాల ఎస్ఐలు మహేందర్, రమేశ్, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుడి నిర్లక్ష్యమే పసికందు ప్రాణం తీసింది

మంచిర్యాలలోని అవని పిల్లల దవాఖాన ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

● డాక్టర్‌తో వాగ్వాదం ● న్యాయం చేయాలని డిమాండ్ ● కేసు నమోదు

పాప కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంచిర్యాల సీఐ ప్రమోద్ రావు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 30 : వైద్యుడి నిర్లక్ష్యమే.. పసికందు ప్రాణం తీసిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖాన ఎదుట ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పాత బెల్లంపల్లి పట్టణానికి చెందిన గందం గంగవ్వ పురిటి నొప్పులతో గత మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరగా, అదే రోజు వైద్యులు నార్మల్ డెలవరీ చేశారు. మొదటి కాన్పులో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు పరిస్థితి విషమంగా మారడంతో బెల్లంపల్లి చౌరస్తాలోని అవని పిల్లల హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు నాలుగు రోజుల పాటు చికిత్స అందించారు. శిశువు కోలుకుందని చెప్పి శనివారం సాయంత్రం డిశ్చార్జి చేశారు. ఈ క్రమంలో గంగవ్వకు ఫిట్స్ రావడంతో స్థానికంగా ఉన్న ఎంసీహెచ్‌కు తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కరీంనగర్ ఎంసీహెచ్‌కు తీసుకెళ్లారు. ఆపై శిశువును కూడా తల్లి వద్దకు చేర్చారు. ఆదివారం శిశువు.. తల్లి పాలు తాగకుండా.. కదలకుండా.. ఉండటాన్ని గమనించారు. వెంటనే పిల్లల దవాఖాన వైద్యుడికి ఫోన్ చేసి విషయం చెప్పారు. మరోసారి పాపను తీసుకురావాలని డాక్టర్ చెప్పాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి పాప మృతి చెందింది. సోమవారం ఉదయం శిశువు మృతదేహంతో దవాఖానకు చేరుకున్నారు. వైద్యుడి నిర్లక్ష్యం వల్లే పాప మృతిచెందిందని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైద్యుడితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రమోద్‌రావు, ఎస్ఐలు ముత్తె ప్రవీణ్, వినిత ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై అవని హాస్పిటల్ వైద్యుడిని వివరణ కోరగా.. తను పాపకు సరైన వైద్యమే అందించానని, కోలుకున్న తర్వాతే డిశ్చార్జి చేశానని, 48 గంటల తర్వాత వచ్చి పాప మృతి చెందిందని ఆందోళన చేశారన్నారు.

వైద్యుడితో వాగ్వాదానికి దిగిన కుటుంబ సభ్యులు

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 30 : జిల్లా ప్రజలు నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. అక్రమ సిట్టింగులు, ఆరుబయట మద్యం సేవించడం, గుంపులు గుంపులుగా తిరుగుతూ మహిళలను వేధింపులకు గురి చేస్తే చర్యలు తప్పవని, ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్ధరాత్రి 12.30 గంటల్లోగా వేడుకలు ముగించుకోవాలని, సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని, అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని తెలిపారు. మద్యం దుకాణాలు, వైన్ షాప్స్, బార్స్ అండ్ రెస్టారెంట్స్ నిర్వాహకులు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి

నస్పూర్, డిసెంబర్ 30 : సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జన్నారం, చెన్నూరు, నస్పూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, లక్షెట్టిపేట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వచ్చి దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు గిరిజన విద్యార్థిని

గుగ్లోత్ రుచిత

కోటపల్లి, డిసెంబర్, 30 : జనవరి 26న ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌కు కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి గుగ్లోత్ రుచిత ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపిక కాగా, అందులో కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల అటానమస్‌లో ఎన్ఎస్ఎస్ వలంటరీగా ఉన్న గుగ్లోత్ రుచిత కూడా ఒకరు. జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో పాల్గొనే రుచిత.. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముతో జరగనున్న తేనేటి విందులో పాల్గొననున్నది. రుచితను మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, స్థానిక నేతలు అభినందించారు.

నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 30: నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఆసిఫాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, పట్టణ సీఐ రవీందర్, రెబ్బెన సీఐ స్వామి, వాంకిడి సీఐ సత్యనారాయణ, జైనూర్ సీఐ రమేశ్ ఉన్నారు.

ఎన్‌హెచ్- 63 విస్తరణకు బ్రేక్

- ముందు నుంచి మూడో అలైన్‌మెంట్‌పై భగ్గుమంటున్న రైతాంగం
- హైకోర్టుకు వెళ్లడంతో పనులను ఆపేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకంగా ఎల్లంపల్లి నిర్వాసితుల భూముల సేకరణ

మంచిర్యాల, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా కుర్మపల్లి వరకు చేపడుతున్న ఎన్‌హెచ్-63 విస్తరణ పనులకు హైకోర్టు ఆదేశాలతో బ్రేక్ పడింది. స్థానికులు, రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో పాటు కొందరు రియల్టర్లు, భూస్వాములు జోక్యం చేసుకోవడంతో హైవే అలైన్‌మెంట్‌ను ఇప్పటికే మూడుసార్లు మార్చాల్సి వచ్చింది. మూడోసారి మార్చిన ప్రతిపాదనలతో గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు భూములిచ్చిన రైతులే.. మరోసారి భూములు కోల్పోవాల్సి వస్తున్నది. ఈ క్రమంలో రైతులు చేసిన విజ్ఞప్తులను ఎన్‌హెచ్ఏ అధికారులు పరిగణలోకి తీసుకోకపోవడంతో.. వారు హైకోర్టును ఆశ్రయించగా పనులను నిలిపివేయాలంటూ ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది.

ముల్కల్ల నుంచి లక్షెట్టిపేటకు వెళ్లే ప్రస్తుత జాతీయ రహదారి-63

మూడుసార్లు మార్పు..

ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ వరకు విస్తరించి ఉన్న ఈ రహదారిని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు ఫోర్‌లేన్‌గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూ.5354.12 కోట్ల అంచనాతో 160 కిలోమీటర్ల పొడవునా పొలాల మీదుగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి అధికారులు మొదటి అలైన్‌మెంట్ రూపొందించారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట శివారులోని పొలాలు, అటవీ ప్రాంతం మీదుగా ముల్కల్ల నుంచి కుర్మపల్లికి ఈ రోడ్డు వచ్చే లా డిజైన్ చేశారు. కానీ.. ఇందుకు స్థానిక రైతులు ఒప్పుకోకపోవడంతో పాటు గ్రీన్‌ఫీల్డ్‌లో భూములు కోల్పోతున్న కొందరు భూస్వాములు, రియల్టర్లు ఫైరవీలు చేసి అధికారులపై ఒత్తిడి తేవడంతో.. ఆ అలైన్‌మెంట్ అర్థంతరంగా రద్దు అయిపోయిందనే ఆరోపణలు వచ్చాయి. సరే రైతుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు మొదటి అలైన్‌మెంట్‌ను మార్చి, రెండోసారి రైతులకు ఎలాంటి ఇబ్బందులేకుండా ప్రస్తుతమున్న రోడ్డునే బ్రౌన్ ఫీల్డ్‌గా మార్చడానికి అలైన్‌మెంట్ తయారు చేశారు. ఈ మేరకు 2023లో నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న రహదారినే విస్తరించాలనేది ఈ ప్రతిపాదన. ఈ క్రమం లో రోడ్డు పక్కన ఉన్న ఇండ్లు, భూములు కోల్పోయే ప్రజలు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. జనాలు అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ అధికారులు సర్వే పూర్తి చేశారు. దీంతో ఇక బ్రౌన్ ఫీల్డ్ హైవే తప్పదని జనాలు సైతం భావించారు. రోడ్డు పక్కన ఖాళీ స్థలాలు ఉన్నోళ్లు కొత్తగా షెడ్లు నిర్మించి, బోర్లు వేసుకున్నారు. నిర్మాణాలు ఉంటేనైనా సాధారణం కంటే ఎక్కువ పరిహారం వస్తుందనుకున్నారు. నిపుణులు సైతం బ్రౌన్ ఫీల్డ్ చేస్తే తక్కువ నష్టం ఉంటుందని చెప్పుకొచ్చారు. కానీ లక్షెట్టిపేటలోని కొందరు తమ భూములు, ఇండ్లు కాపాడుకోవడం కోసం బ్రౌన్ ఫీల్డ్‌కు అడ్డుపడ్డారు. బ్రౌన్‌ఫీల్డ్‌పై తప్పుడు నివేదిక ఉన్నతాధికారులకు వెళ్లేలా చూశారనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. ఎట్టకేలకు రెండో అలైన్‌మెంట్ సైతం రద్దు కావాల్సి వచ్చింది. అనంతరం ఎన్‌హెచ్ఏ అధికారులు లక్షెట్టిపేట మండలం మోదెల నుంచి కుర్మపల్లికి మూడో అలైన్‌మెంట్ రూపొందించారు. గోదావరి తీరం వెంట 35 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని భావించి.. ఇందుకోసం మంచిర్యాల జిల్లాలోని 17 గ్రామాల్లో 1433.75 ఎకరాల భూ సేకరణకు సిద్ధమయ్యారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం నుంచి గోదావరి మీదుగా మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట శివారుగా ముల్కల్ల దాకా మూడో అలైన్‌మెంట్ ప్లాన్ రెడీ చేశారు.

రైతుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత..

ఇక మూడో అలైన్‌మెంట్‌ను అనుసరించి ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చి, భూములు కోల్పోయే రైతులకు నోటీసులు జారీ చేశారు. దీనిపై భూములు కోల్పోయే రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరి కోసం ఎన్‌హెచ్-63 అలైన్‌మెంట్ మార్చారంటూ అధికారులను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులో కొంత భూములు కోల్పోయామని, ఉన్న కొద్దిపాటి భూమి కూడా ఈ అలైన్‌మెంట్‌లో పోతుందంటూ మొరపెట్టుకున్నారు. ఎన్‌హెచ్ఏ చట్ట ప్రకారం నడుచుకోకుండా, హడావుడిగా నోటీసులు ఇచ్చి భూములు లాగేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారంటూ ఆర్డీవో కార్యాలయం ఎదుటే నోటిఫికేషన్‌ను తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా అప్పుడు చర్చనీయాంశంగా మారింది. రైతులకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో హైవేలు, ప్రాజెక్టుల కోసం ఓసారి భూములు కోల్పోయిన వారి నుంచి రెండోసారి భూ సేకరణ చేయడానికి వీల్లేదని.. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆధారంగా కోర్టుకు వెళ్తామంటూ రైతులు హెచ్చరించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద హజీపూర్, లక్షెట్టిపేట మండలాల్లో వేల ఎకరాల సాగు భూములు తీసుకున్నారు. దాదాపు 9 గ్రామాల ప్రజలు నిర్వాసితులుగా మారారు. వారికి వేరే దగ్గర భూములు, ఇండ్లు పరిహారంగా అందజేశారు. ఇప్పుడు మూడో అలైన్‌మెంట్‌లో మళ్లీ అదే గ్రామాల రైతులు భూములు కోల్పోతున్నారు. అధికారులు అలైన్‌మెంట్ మార్చకపోతే కోర్టుకు వెళ్తామని చెప్పినట్లే రైతులు కోర్టును ఆశ్రయించారు. బాధితుల తరపున న్యాయవాది భూ సేకరణలో నిబంధనలు పాటించడం లేదని, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోలేదని చేసిన వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం.. పనులను ఆపేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఎన్‌హెచ్ఏ అధికారులు ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాల్సి ఉంది.

ఏ ఒక్కరూ కనికరించలేదు

రైతుల కడుపుకొట్టి హైవే నిర్మించడం సరికాదని మొరపెట్టుకున్నా అధికారులు గోడు పట్టించుకోలేదు. ప్రభుత్వాలు సైతం రైతులకు న్యాయం చేయలేకపోయాయి. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మా భూములు ఇచ్చి అన్ని కోల్పోయాం. ఈ విషయం నాయకులు, అధికారులకు చెప్పి వేడుకున్నా ఒక్కరూ కనికరించలేదు. మేము ఒప్పుకోకున్న మా భూములు గుంజుకుంటామని అధికారులు నోటీసులు పంపించారు. నోటీసులు తీసుకోకుంటే ఏకంగా మా ఇంటి గోడలకు అంటించి వెళ్లిపోయారు. కానీ రైతుల పక్షాన న్యాయదేవత నిలిచింది. రైతుల కన్నీరు చూడలేక న్యాయస్థానం పనులు ఆపేయమని తీర్పు చెప్పింది. ఇందుకు మాకెంతో ఆనందంగా ఉంది.

- ఎంబడి రాజు, రైతు, లక్షెట్టిపేట

ఏడాదిగా కంటిమీద కునుకు లేదు

మా భూములు తీసుకోకండి సారూ అంటూ ఏడాది పాటు తిరగని ఆఫీసు లేదు. నాయకులను కూడా కలిసి గోడు చెప్పుకున్నం. కానీ ఎవరూ ఏం చేయలేక పోయారు. ఎవరి స్వార్థం వాళ్లు చూసుకున్నారు. పనులు ఆపేందుకు ప్రభుత్వాలతో మాట్లాడుతున్నాం.. మా చేతుల్లో ఏమీ లేదు.. అని చెప్పి తప్పించుకున్నారు. ఎట్టకేలకు న్యాయస్థానం రైతుల పక్షాన నిలిచింది. రైతుల గోడు వినిపించుకొని స్టే ఇచ్చి ఎక్కడికక్కడ పనులు ఆపేసింది. న్యాయస్థానం తీర్పుతో కడుపు నిండా తింటున్నాం.. కంటి నిండా నిద్రపోతున్నాం. మాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం.

- కృష్ణ ముకుందా, రైతు, ఇటిక్యాల.

మున్సిపల్ కమిషనర్ కొడుకుపై కేసు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 30: పోలీసులపై ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు కుమారుడు ప్రణయ్ దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 24న పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా, కమిషనర్ కుమారుడు ప్రణయ్ ఒకే బైక్‌పై మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వస్తుండగా ఎస్ఐ అడ్డుకున్నారు. జరిమానా విధించేందుకు యత్నించగా ప్రణయ్ దురుసుగా ప్రవర్తించాడు. కొందరు ఈ ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమల్లో వైరల్ చేశారు. ప్రణయ్‌పై ట్రిపుల్ రైడింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పడిగాపులుకాస్తున్న కోసిని గ్రామ మహిళలు

'ఇందిరమ్మ' ఇంటి కోసం పడిగాపులు

కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద మహిళల నిరీక్షణ

కాగజ్‌నగర్, డిసెంబర్ 30 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద సోమవారం పడిగాపులు కాస్తున్న ఈ మహిళలది కోసిని గ్రామం. ఇటీవల ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించగా, తమ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని తెలిసి కార్యాలయానికి వచ్చారు. ఇంటర్నెట్ సమస్య కారణంగా మహిళలు చాలా సమయం వేచి చూడాల్సి వచ్చింది. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో సాంకేతిక సమస్య ఉత్పన్నమైతే మరుసటి రోజు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని బాధితులు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దహెగాం, డిసెంబర్ 30 : దహెగాం ప్రభుత్వ పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకేచోట చేరి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకొని ఆనందంగా గడిపారు. చదువు నేర్పిన గురువులను గుర్తుకుతెచ్చుకున్నారు. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం మెట్టుపల్లిలో ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు గోమాస్ జయరాజ్ వద్దకు వెళ్లి సత్కరించారు.